క్లుప్తంగా

నేడు గృహ సారథులకు శిక్షణ

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ సమీపంలోని పోలం సిద్దారెడ్డి ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గృహ సారథులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30 గంటలకు సమావేశం ప్రారంభవుతుందన్నారు.

పరామర్శ

నల్లమాడ: మండలంలోని సానేవారిపల్లిలో మండల వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి మాతృమూర్తి పద్మావతమ్మ (80), అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పాపిరెడ్డి తల్లి వెంగమ్మ (76) ఇటీవల మృతిచెందారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం రాత్రి గ్రామానికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే కొత్తపల్లి తండాలో పక్షవాతంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆనంద్‌నాయక్‌ను పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం అందించారు. ఎస్.ఎనుమలవారిపల్లి వద్ద నిర్మించనున్న రిజర్వాయర్ స్థలాన్ని పరిశీలించారు. భూమిపూజ, శిలాఫలకం ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, సర్పంచులు కుళ్లాయప్ప, బొజ్జేనాయక్, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

8న వాహనాల వేలం

రామగిరి: పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 8న వాహనాల వేలం ఉంటుందని ఎస్ఐ జనార్దన్‌నాయుడు ఆదివారం తెలిపారు. గతంలో కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడిన 54 ద్విచక్రవాహనాలను వేలం వేయనున్నట్లు తెలిపారు.

ఉత్సవాలకు విరాళం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేతిరెడ్డి సూర్యప్రతాప్‌రెడ్డి కాలనీలోని శివాలయంలో శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ సరితాల బాషా, కుమార్తె సరితాల విద్య జాస్మిన్ ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు రూ.లక్ష విరాళంగా అందించారు.

ఏఐబీఎస్ఎస్ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా రాజునాయక్

ఓడీ చెరువు: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఏఐబీఎస్ఎస్) జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా ఓడీ చెరువుకు చెందిన రాజునాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పుట్టపర్తిలో జరిగిన జిల్లా సమావేశంలో ఈ మేరకు ఏఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాలానాయక్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ

గాండ్లపెంట: మలమీదపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ చేయనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

కోటి మొక్కలు నాటడమే లక్ష్యం

పుట్టపర్తి టౌన్: సత్యసాయి జిల్లాలో కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా పని చేస్తామని గ్రీన్ భారత్ ఫౌండేషన్ చైర్మన్ రెడ్డి శంకరనారాయణ తెలిపారు. పట్టణంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టీ ఆర్.జే రత్నాకర్ చేతుల మీదుగా జి.బి (గ్రీన్ భారత్) చానల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పచ్చదనం పెంపొందించడమే గ్రీన్ భారత్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మీడియా గౌరవాధ్యక్షుడు సుకుమార్ గుప్తా, ఇన్‌చార్జ్ నిజాముద్దీన్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి

ప్రశాంతి నిలయం: సత్యసాయిని కీర్తిస్తూ చక్కటి స్వరాలొలికిస్తూ భక్తులు నిర్వహించిన సంగీత కచేరి శ్రోతలను ఆకట్టుకుంది. ఆదివారం ఉత్తర తమిళనాడులోని కాంచీపురం సత్యసాయి భక్తులు సంగీత కచేరి నిర్వహించారు. సత్యసాయి వైభవాన్ని చాటుతూ గంట పాటు నిర్వహించిన కచేరీతో సాయికుల్వంత్ సభా మందిరం మార్మోగింది.

పార్టీ బలోపేతానికి పని చేయాలి

కనగానపల్లి: బీజేపీ బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని పర్వతదేవరపల్లిలోని మల్లికార్జున ఆలయ కల్యాణ మండపంలో గసత్యసాయి జిల్లా బిజెపి కార్యకర్త సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందన్నారు. టీడీపీ నాయకుడు నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర జనం లేక వెలవెలబోతోందని అన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఓబిలేసు, పార్థసారథి, సుదర్శన్, ఆంజనేయులు, కాటమయ్య పాల్గొన్నారు.

15న పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చెరువుకట్ట సమీపంలోని కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీన పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ద్వారకనాథ్‌శర్మ తెలిపారు. ఆదివారం కల్యాణోత్సవానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

టార్గెట్ 2024 ఎన్నికలు

- జగనన్నను రెండోసారి సీఎం చేయడమే లక్ష్యం
- చంద్రబాబు మోసాలను ప్రజలకు చెప్పండి
- గృహ సారథులకు శిక్షణలో ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సిద్దారెడ్డి



గృహసారథులకు దిశానిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

నల్లమాడ: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 నియోజకవర్గ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆకాంక్షను నెరవేర్చే దిశగా గృహ సారథులు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సాయి సప్తగిరి కల్యాణ మండపంలో ఆదివారం మండలంలోని గృహ సారథులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు కలసికట్టుగా పని చేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమమే మన అజెండా అని, ఈసారి కూడా నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు.

అబద్ధపు హామీలతో టీడీపీ మోసం

2014 ఎన్నికల్లో 600 అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్క హామీ నెరవేర్చకపోగా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు. ఇంటికో ఉద్యోగం, డ్వాక్రా రుణాల మాఫీ, పసుపు–కుంకుమ అన్నీ మోసపూరిత ప్రకటనలే అన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు కుటుంబానికి తప్పా ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. 2019 ఎన్నికలకు ముందు నియోజకవర్గంలో ఎన్ని చెరువులున్నాయో కూడా తెలియని మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి చెరువులు నింపేందుకు తానే జీఓ తెచ్చానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. హిందూపురం కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు సంతకం చేసిన ద్రోహి పల్లె అన్నారు. టీడీపీ హయాంలో ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి లంచాలు దండుకున్నారని ఆరోపించారు.

హామీలు నెరవేర్చిన ఘనత జగనన్నదే..

ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ మూడేళ్లలోనే నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడు విడతల్లో రూ.20,100 కోట్ల డ్వాక్రా రుణాలు మాఫీ చేశామన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో రూ.6 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఎస్.ఎనుమలవారిపల్లి, గాజులపల్లి రిజర్వాయర్‌ల నిర్మాణ పనులకు త్వరలోనే భూమిపూజ చేయనున్నట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొరకల రమణ, కేశప్ప, మాజీ మండల కన్వీనర్ పొరకల రామాంజనేయులు, పట్టణ కన్వీనర్ వేణుగోపాల్, అంజినాయక్ మాట్లాడారు. ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రసూల్, నాయకులు జయరామిరెడ్డి, పీవీ భాస్కర్ రెడ్డి, దుద్దుకుంట వెంకటరెడ్డి, బాలాజీనాయుడు, కమలాకర్ నాయుడు, మోదీనమ్మ పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

పుట్టపర్తి: సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బుక్కపట్నంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మండలంలో సచివాలయాల గృహ సారథులు, వలంటీర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం ప్రతి కుటుంబానికి భారీగా లబ్ధి చేకూర్చిందన్నారు. గృహ సారథులు, వలంటీర్లు ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించాలని పేర్కొన్నారు. గడచిన మూడున్నర సంవత్సరాల్లో బుక్కపట్నం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. 4 వేల వైఎస్సార్ గృహాలు మంజూరు చేయించామన్నారు. ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం మీదుగా 342 జాతీయ రహదారి నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి సిద్దరాంపురం కేశప్ప, సర్పంచ్ నాగలక్ష్మమ్మ, బుక్కపట్నం సొసైటీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ వెంకట చౌదరి, వైస్ ఎంపీపీ ఆదినారాయణ పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయండి

గాండ్లపెంట: రాష్ట్రంలో ముప్పై ఏళ్లుగా జరగని అభివృద్ధిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మూడేళ్లలో చేశారని ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి అన్నారు. స్థానిక ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు కొండవీటి నాగభూషణం అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రహదారి లేని మారుమూల గ్రామాలకు సైతం రోడ్లు వేయించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌కే దక్కుతుందన్నారు. పథకాలు గడప వద్దకే అందించేందుకు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. కళ్ల ముందర జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని చంద్రబాబు తన ఎల్లోమీడియా ద్వారా ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాతం జగన్మోహన్, వైఎస్ ఎంపీపీలు గంగోజమ్మ, భారతి, ఎంపీటీసీలు ఖమర్‌జహాన్, సోమశేఖరరెడ్డి, జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీంద్రానాయక్, సొసైటీ మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణ గుర్తింపు కార్డులు అందజేత

కదిరి అర్బన్: స్థానిక ఆర్టీసీ డిపోలోని నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిమోహన్ మాట్లాడుతూ.. ఆర్టీసీలో సెప్టెంబర్ 1, 2014 నుంచి ఉద్యోగ విరమణ చేసిన వారు, ప్రస్తుతం సర్వీసులో ఉండి సెప్టెంబర్ 1, 2014లోపు రెగ్యులర్ అయిన వారు తప్పనిసరిగా జాయింట్ డిక్లరేషన్ ఫాం మూడు సెట్లను ఆఫీసులో అందజేయాలన్నారు. ఈనెల 10వ తేదీ తుది గడవు అని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులు హయ్యర్ ఆప్షన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబాలకు 5 ఏళ్ల వ్యాలిడిటీ కలిగిన ఉచిత ప్రయాణ గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో బాషా, గోపాలకృష్ణ, నరసింగరావు, తాహిర్ పాల్గొన్నారు.

గంగా భవాని ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రజలు ఐక్యతగా ఉండి ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యుడు ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తి మున్సిపాలిటీలో 3వ వార్డులో చిత్రావతి నది ఒడ్డున వెలసిన గంగా భవాని ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడుస్తూ భక్తి పారవశ్యం పెంపొందించుకోవాలన్నారు. పురాతన కట్టడాలు, దేవాలయాలను అంతరించి పోకుండా కాపాడుకోవాలన్నారు. చిత్రావతి నది ఒడ్డున ఎన్నో ఏళ్లుగా గంగమ్మకు చిన్న గుడి ఉండగా.. దాతల సహాయంతో పెద్ద ఆలయం నిర్మిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్ చెరువుభాస్కర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పీసీ గంగన్న, పుట్ల గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సత్యనారాయణ స్వామి వ్రతం



ధర్మవరం అర్బన్: సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరిస్తున్న దంపతులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే ఆలయ ప్రధాన అర్చకుడు సురేష్ వేదమంత్రాలతో సామికి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం భక్తులతో సామూహిక సత్యనారాయణ వ్రతం జరిపించారు. మాఘమాసంలో సత్యనారాయణ వ్రతం చేసుకోవడం వల్ల శుభ ఫలితాలు ఉంటాయన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహకులు ద్రాక్షాయణి, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. 70 మంది దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

పుట్టపర్తి టౌన్: బంజారాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి, బంజారాలపై దౌర్జన్యాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా బంజార సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకరటమణ నాయక్ అన్నారు. ఆదివారం సాయి ఆరామంలో ఆ సంఘం నాయకులు సమావేశమై జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకరటమణ నాయక్, రిటైర్డ్ ఎస్పీ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా బంజారాల అభివృద్ధి అంతంత మాత్రం ఉందన్నారు. అన్ని పార్టీలు చట్టసభల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆంజనేయులు నాయక్, ఉపాధ్యక్షులుగా మోహన్‌నాయక్, రాజేష్‌నాయక్, వరుణ్‌నాయక్, కోశాధికారిగా ఏఆర్‌డీ నాయక్, మహిళా అధ్యక్షురాలిగా హేమలతను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చెన్రేనాయక్, శ్రీనివాసులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

కదిరి అర్బన్: ప్రజా భద్రత విశ్వాసాలకు భరోసానిస్తూ ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాలతో ఆదివారం పట్టణంలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు చేపట్టింది. కదిరి పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి మారుతీ సర్కిల్, జీవిమాను సర్కిల్ నానాదర్గా, మార్కెట్ ఏరియా, ఇక్బాల్‌రోడ్, చౌక్‌బజార్, హిందూపూర్ క్రాస్, రాయలసీమ సర్కిల్, వేమారెడ్డి సర్కిల్, అంబేద్కర్ సర్కిల్ మీదుగా కవాతు సాగింది. కార్యక్రమంలో హకింపేట 99వ బెటాలియన్ ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ వినోద్, అసిస్టెంట్ కమాండెంట్ సతీష్, కదిరి డీఎస్పీ భవ్యకిషోర్, సీఐలు సూర్యనారాయణ, మధు, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్ష కేంద్రాల తనిఖీ



బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై వివరిస్తున్న డీఈఓ మీనాక్షి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల, కొత్తపేట బాలుర ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ పరీక్ష కేంద్రాలను ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి తనిఖీ చేశారు. అనంతరం బీఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లను ఎలా వినియోగించాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఆస్పత్రికెళ్లి పింఛన్ అందజేత

కదిరి అర్బన్: మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లిలో 33వ వార్డులోని రవిచంద్రకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ప్రభాకర్‌యాదవ్ ఆదివారం అనంతపురం వెళ్లి, పింఛన్ సొమ్ము అందజేశాడు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

ఎన్పీకుంట: మండల పరిధిలోని ఆసంవారిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలం మహేశ్వరరెడ్డి (45) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి కదిరి ఏరియా ఆసుపత్రిలో మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అలాగే మండల పరిధిలోని బత్తినిగారిపల్లికి చెందిన ఆంజినేయులురెడ్డి (40) క్యాన్సర్‌తో బాధపడుతూ ఆదివారం తెల్లవారుఝామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి నాయకులతో కలిసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి, ఎంపీటీసీ కొత్త రంగారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, వెంకటరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గంగిరెడ్డి, మాజీ ఎంపీపీ సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి

అమడగూరు: అన్ని రకాల వాహనాల డ్రైవర్లకు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని ఎస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. ఆదివారం బిళ్లూరు క్రాస్‌లో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మట్లాడుతూ.. ఎలాంటి సర్టిఫికెట్లు లేకున్నా ఉన్నతాధికారులతో మాట్లాడి డ్రైవర్లకు లైసెన్స్ ఇవ్వడానికి ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ట్రాఫిక్ నిబంధలను పాటించడం ద్వారా ప్రమాదాలు జరగకుండా ఉంటాయన్నారు. అక్రమంగా కర్ణాటక మద్యం, గుట్కా సరఫరా చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని , క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. లైసెన్స్ లేనివారు వెంటనే స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జమేదారు సుధాకర్ పాల్గొన్నారు.

శివపార్వతుల విగ్రహాల ఊరేగింపు

ధర్మవరం: పట్టణంలోని శివానగర్‌లోని అతి పురాతన శివాలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. శివుడికి అభిషేకాలు, పంచామృతాభిషేకం, అర్చనలు చేపట్టారు. అనంతరం శివుడి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన బంగారు రథంలో కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. 108 కలశాలతో మహిళలు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గడ్డం వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం రంగ పాల్గొన్నారు.

మాఘమాస సందడి

బత్తలపల్లి: మండలంలోని సంజీవపురం కాటికోటేశ్వరక్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రం, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్లలోని వీరనారాయణస్వామి, డి.చెర్లోపల్లి సిద్ధేశ్వరాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, ముష్టూరు, పోట్లమర్రి శివాలయల్లా మాఘమాస సందడి నెలకొంది. మాఘమాస దీక్షలు చేపట్టిన పలువురు మహిళలు మూడో ఆదివారం ఆలయాల వద్ద భక్తిశ్రద్ధలతో పాల పొంగులు నిర్వహించారు. కొత్త కుండలో నైవేద్యం చేపట్టారు.

కనగానపల్లి: మండలంలోని పలు శివాలయాల్లో మాఘపౌర్ణమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో కనగానపల్లిలోని మల్లికార్జునస్వామి, తగరకుంటలో మల్లన్నస్వామి, ముక్తాపురంలోని ముక్తీశ్వరాలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజామున నుంచే శివలింగాలకు అభిషేకాలు జరిపారు. తగరకుంటలో శివస్వాముల ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

70 మందికి కంటి పరీక్షలు

ధర్మవరం అర్బన్: యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చిందని ఆ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు, కార్యదర్శి సుకుమార్, చాంద్‌బాషా తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్నూలు శ్రీచక్ర ఆసుపత్రి వైద్యుల సహకారంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 70 మంది కంటిచూపు తగ్గిన వారికి పరీక్షలు చేయగా.. వారిలో 37 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కంటిచూపు తగ్గిన వారికి ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రాధాకృష్ణ, ప్రసాద్, రమేష్, బాబు, జయరాం పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య శిబిరం

ధర్మవరం: పట్టణంలోని పార్థసారథి నగర్‌లో ఆదివారం వార్డు కౌన్సిలర్ గోరకాటి పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యులు ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. 125 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తలుపుల: మండల కేంద్రంలోని సచివాలయం–1 పరిధిలోని టీచర్స్ కాలనీలో సోమవారం మధ్యాహ్నం 2:30 గంటలకు ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీపీ రఫీ నాయక్, సర్పంచ్ శ్రీలత, ఉప సర్పంచ్ డీకే బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

ఓబులంపల్లిలో..

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ఓబులంపల్లిలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాప్తాడు గడప గడప ఇన్‌చార్జ్ హరినాథ్ రెడ్డి తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

కుమ్మరవాండ్లపల్లిలో రేపు..

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి 1, 2 సచివాలయాల పరిధిలో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో ఈనెల ఈనెల 7వ తేదీన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ ప్రకాష్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల సభ్యులు, కార్యకర్తలు, హాజరుకావాలని కోరారు.

కమనీయం.. శ్రీగిరి రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

పుట్టపర్తి టౌన్: పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం సత్యసాయి శ్రీగిరి రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ప్రతి పౌర్ణమి నాడు శ్రీగిరి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రశాంతి నిలయం ముఖద్వారం వద్ద అందంగా అలంకరించిన సత్యసాయి చిత్రపటాన్ని రథంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రశాంతి నిలయం, విద్యాగిరి, గోకులం, ఎనుములపల్లి, గణేష్ కూడలి, పెట్రోల్‌బంక్, చింతతోపు, గోవిందయ్య పేట, పెద్దబజార్ మీదుగా రథాన్ని లాగారు. గిరిప్రదక్షణలో విదేశీ భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి జాతర



చౌడేశ్వరి దేవిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

తలుపుల: మండలంలోని బట్రేపల్లిలో ఆదివారం చౌడేశ్వరి జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గ్రామం చివర ఉన్న బావి వద్దకు ఊరేగింపుగా వెళ్లి, పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని ఆలయానికి తీసుకొచ్చి నైవేద్యం సమర్పించారు. జంతుబలి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డా.పి.వి సిద్దారెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు జానపద, సృజనాత్మకత అకాడమీ చైర్మన్ కొండవీటి నాగభూషణం, సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులురెడ్డి తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గరుడ వాహనంపై లక్ష్మీచెన్నకేశవుడి వైభవం



కోలాటం ఆడుతున్న మహిళలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం పౌర్ణమి సందర్భంగా గరుడోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాశెట్టి సుబ్రహ్మణ్యం, సభ్యులు, డైరెక్టర్ల సమక్షంలో గరుడ వాహనంపై లక్ష్మీచెన్నకేశవస్వామి ఎరవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గోదా రంగనాథ మహిళా సంఘం సభ్యులు కోలాటం ఆడుతూ ఆకట్టుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎన్ఎంయూ నాయకులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలోని ఆరు డిపోల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్‌ను నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మిక నాయకులు కోరారు. పెండింగ్‌లో ఉన్న అలవెన్సులు లీవ్ ఎన్‌క్యాష్ మెంట్ ఇప్పించాలన్నారు. సర్వీసు కండీషన్లను మార్చాలని, పని చేస్తూ చనిపోయిన ఉద్యోగుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని విన్నవించారు. కొత్త సర్వీసులు కొనుగోలు చేయాలన్నారు. డీపీటీఓ మధుసూదన్ మాట్లాడుతూ.. సమస్యలను ఉన్నతాకారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. జిల్లాలోని ఆరు డిపోల్లో సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకూ ఉన్న క్రూ అలవెన్సులను సీఎఫ్ఎంఎస్‌లో అప్లోడ్ చేశామన్నారు. ట్రెజరీ వారు ఆమోదించారని తెలిపారు. కార్యక్రమంలో కడప జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీరామ్‌నాయక్, రీజనల్ చైర్మన్ ముత్యాలప్ప, అధ్యక్షుడు అశ్వర్థమయ్య, సెక్రటరీ షెబ్బీర్, ఉపాధ్యక్షుడు రవితేజ, డిపో ప్రెసిడెంట్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.